www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు


సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 29 | 15-04-2024 | పుటలు : 4




## మంచిమాట

స్వతంత్రంగా జీవించే అవకాశం ఉండీ..
బానిస భావాలు కలిగిన వ్యక్తికన్నా
స్వతంత్ర భావాలున్న
బానిస వెయ్యిరెట్లు మేలు
- బి.ఆర్. అంబేద్కర్



## అంబేద్కర్ ఆశయాలకు

# అనుగుణంగా జీవించాలి

**14.04.24 (మీడియాసెల్)**

ప్రపంచంలోని అన్ని దేశాలలో కొనియాడబడుతున్న మహోన్నత వ్యక్తి డా.బి.ఆర్.అంబేద్కర్ అందరివాడు అని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత పయనించాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం ఆవరణంలోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ పద్మరాజు మాట్లాడుతూ అంటరానివానిగా ఆరంభమైన అంబేద్కర్ అందరివాడిగా ఎదిగి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని అన్నారు. అంబేద్కర్ కు విద్యపై ఉన్న ఆసక్తితో బాంబే, కొలంబియా, లండన్ యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించారని చెప్పారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా భారతదేశానికి ఎనలేని కృషి చేసారని తెలిపారు. స్త్రీ విద్యకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని, ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది స్త్రీలు ఉండటం హర్షనీయమన్నారు. బోధించు, సమీకరించు,పోరాడు అనే అంబేద్కర్ నినాదంలోని అర్థాలను తెలియజేసారు. విద్య, విజ్ఞానానికి సంబంధించి అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలని చెప్పారు. వివాదాలు, విభేదాల వైపు కాకుండా మంచిని స్వీకరించి, దానిని అనుసరించి జీవించాలన్నారు. వివిధ, జాతులు, మతాలు ఉన్న భారతదేశానికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దిక్సూచిగా నిలిచిందన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ



రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విద్యతో ఆయన సాధించిన అపారమైన మేధస్సు ప్రపంచ దేశాలలో ఎనలేని గుర్తింపును తీసుకువచ్చిందన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ క్యాంపస్ లలో అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయని తాడేపల్లిగూడెం క్యాంపస్ లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు వీసీ అమోదించారని తెలిపారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీలలో విజేతలకు సర్టిఫికెట్టులను, బహుమతులను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తూ...



# సంపాదకీయం




## ధర్మ ప్రతిపాదకం

శ్రీమద్రామాయణం ఆదికావ్యం. దీనిని పెద్దలు అనేక కోణాల నుంచి దర్శించి తరించారు. వేదానికి ప్రతిరూపమని, మంత్ర పూతమని, గాయత్రీ మంత్రానికి కథారూపమని, వేదాంత తత్త్వ ప్రతిపాదకమని, రమ్యమైన కావ్యమని, ప్రతీకాత్మకమైన ఆఖ్యానమని....ఇలా అనేక రకాలుగా అభివర్ణించారు. రామాయణంలో తరచిన కొద్దీ అనేక విశేషాలు మనకు కనిపిస్తాయి.

రామాయణ మహాకావ్యంలోని పాత్రలు సజీవమైనవి.సాధారణ మానవుల అనుభూతులను, ఆవేశాలను,ఆశ నిస్పృహలను ప్రదర్శిస్తాయి. శ్రీరాముడు మహా పరాక్రమవంతునిగా,

ధర్మబద్ధునిగా, మానవ సహజమైన సుఖదుఃఖాలకు అతీతుడు కానట్టు వ్యవహరిస్తాడు.భరతునికి రాజధర్మం ఉపదేశిస్తాడు. వాలితో ధర్మ సూక్ష్మాలు గురించి చర్చిస్తాడు. రావణుడు సీతను అపహరిస్తే సామాన్య మానవునిలా రోదిస్తాడు. ధర్మం విషయంలో స్థిర చిత్తునిగా చివరి వరకు సాక్షాత్కరిస్తాడు. అదే అతని అసలైన గుణం.

సీతమ్మ ఒకసారి ఆవేశకావేశాలకు లోనైన సామాన్య స్త్రీ వలె, మరొక సందర్భంలో బేలగా, రావణుని తృణీకరించిన మహాశక్తిగా దర్శనమిస్తుంది. ఎన్ని రకాలుగా కనిపించినప్పటికీ ఆమె ధీరోదాత్తత.

సీతమ్మలాగే తార,మండోదరి కూడా ధర్మ వేత్తలుగా, విచక్షణ జ్ఞానం ఉన్న వారిగా దర్శనమిస్తారు. మండోదరికి సీతమ్మలో ఉన్న సద్గుణాలు, సౌందర్యం సమానంగా ఉన్నాయి. అందుకే మండోదరిని చూసి హనుమంతుడు ఒక సందర్భంలో ఈమెయే సీతమ్మ అని భ్రమపడ్డాడు. రామాయణంలో చాలా స్త్రీ పాత్రలు విశిష్టమైనవి. పురుషులతో సమానమైన ప్రతిపత్తిని కలిగి ఉన్నాయి.

అలాగే రాక్షసులు అంటే ఏమీ తెలియని మూరు?లు కాదు. వారి ప్రవృత్తి ధర్మ వ్యతిరిక్తమైన పనులను చేసేందుకు ప్రేరేపిస్తుంది. కుంభకర్ణుడు క్రూరుడే.కానీ రావణునికి ధర్మబోధ చేస్తాడు. ప్రతినాయకుడైన రావణుడు రామునికి దీటైన తేజోవంతుడే కానీ అధర్మ ప్రవృత్తి వదిలితే ఇంద్రుడంతటివాడు.

అందుకే వాల్మీకి మహర్షి రామాయణానికి మరో రెండు పేర్లు కూడా సూచించాడు. సీతాయా: చరితమ్, పౌలస్త్యవధ అని. అంటే రాముడు,సీత, రావణుడు ఈ ముగ్గురి కథయే రామాయణం.

ఈ మహాకావ్యం ఇంత లోకప్రియం అవటానికి, జనాదరణ పొందటానికి ప్రధానమైన కారణం మొదటి నుంచి చివరి వరకు పాత్రల మధ్య సంభాషణ చాతుర్యం, ప్రతి ఘట్టంలోనూ ఆయా వ్యక్తుల మానసిక స్థితి సవిస్తరంగా మాట్లాడించటం. అందువల్లనే ఆయా సంఘటనలను ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలుగుతుంది.అలా నడిపించగల మనోనేత్రం, భావనాశక్తి వాల్మీకి మహర్షి సొంతం. అందుకే రామాయణం ఒక రసామృత తరంగిణి. ఆ రసతరంగిణిలో విచిత్రమైన మానవ మనోభావ లహరీ విలాసాలను సహృదయులు మనోనేత్రాలతో తిలకించి ఆనంద పారవశ్యాన్ని పొందుతుంటారు.

రాముని మహనీయతను ప్రతిపాదించే వాక్యమే...

'రామో విగ్రహవాన్ ధర్మః'.

ధర్మస్వరూపాన్ని తెలుసుకోవటానికి, అనుసరించటానికి, అనువర్తింప చేసుకోవటానికి భారతీయ సాహిత్యంలో ఆదికావ్యమైన రామాయణం మనకు ఆధారంగా నిలుస్తోంది.

వందే వాల్మీకి కోకిలమ్

## నన్నయలో డాక్టర్ వినయ్ సుంకర జయంతి



డాక్టర్ వినయ్ సుంకర జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ హెల్త్ సెంటర్ లో వినయ్ సుంకర విగ్రహానికి పూలమాలలు వేసి వీసీ ఆచార్య కె.పద్మరాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డాక్టర్ వినయ్ సుంకర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డా.సుంకర వెంకటేశ్వరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డాక్టర్ వినయ్ సుంకర పేరుతో హెల్త్ సెంటర్ భవనాన్ని నిర్మించారని తెలియజేసారు. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు తన కుమారుడ్ని స్మరించుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డా.సుంకర వెంకటేశ్వరరావు, విశ్వవిద్యాలయ అధికారులు, హెల్త్ సెంటర్ వైద్యులు, అధ్యాపకులు వినయ్ సుంకర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కిక్ బాక్సింగ్ విజేతకు
## రూ.20 వేలు నగదు బహుమతి



ఆల్ ఇండియా యూనివర్సిటీస్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి కాంస్య పతకాన్ని సాధించిన సిహెచ్ దినేష్ కు రూ.20వేలు నగదు బహుమతిని వీసీ ఆచార్య కె పద్మరాజు అందజేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలో దినేష్ కు నగదు బహుమతిని అందజేసి అభినందించిన వీసీ పద్మరాజు వివరాలు తెలియజేశారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీస్ జాతీయ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిహెచ్ దినేష్ కిక్ బాక్సింగ్ అథ్లెట్ 81 కేజీల బరువు విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. దినేష్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల అయిన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడని తెలిపారు. ఎంతో కృషి పట్టుదలతో క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ యువతకు దినేష్ స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా. బి.రామ్ గోపాల్, కిక్ బాక్సింగ్ కోచ్ ఎం. భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ క్యాంపస్‌లో అంబేద్కర్ జయంతి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను నిర్వహించారు. క్యాంపస్ అధికారులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. భారత రాజ్యాంగం నిర్మాణంలోనూ సంఘ సంస్కరణలోను అంబేద్కర్ చేసిన కృషిని అధికారులు తెలియజేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జీవించాలని సూచించారు.



## గూడెం క్యాంపస్‌లో అంబేద్కర్ జయంతి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133 జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.



# ఆచార్య టేకి ఒక జ్ఞాపకం! ఆయనొక పరిశోధనా వ్యాపకం!!

"కన్నుతెరిస్తే జననం
కన్నుమూస్తే మరణం
రెప్పపాటేగదా ప్రయాణం!"

క్షణంలో....ఈ క్షణం చరిత్ర
అయిపోతుంది!
మనప్రక్కనే అంతవరకు నడుస్తు
న్న మనిషి కాలమాంత్రికుని
మంత్రదండంతో మాయమై
పోతే........!
మరలిరాని లోకాలకు మరలి పోతే.....!
ఎంత బాధ! ఎంత వ్యథ!
ఆ వ్యక్తి మనకి మిగిల్చిన
జ్ఞాపకాలు మన స్మృతిపథంలో
నడయాడుతూనే ఉంటాయి.
పోయినవారి మంచితనం మంచి
లక్షణాలు మన జీవన గమనానికి
మార్గదర్శకత్వం వహిస్తాయి.

"యద్యదాచరతిశ్రేష్ఠః
తత్తదేవేతరోజనః
సయత్ప్రమాణంకురుతే
లోకస్తదనువర్తతే"

ఒక మహనీయుని ప్రవర్తనను
పదిమంది ప్రమాణంగా స్వీకరించి
అనుసరిస్తారు.




మరణం-ప్రేమ అనే రెండురెక్కల మీద మనిషి
దివంగతుడౌతాడట! ప్రకృతి ఋణం తీర్చుకొనటమే మృతి!
మృతి నిజస్వరూపం
మనకి ప్రియమైనవారు కానరాని లోకాలకి సాగిపోయినపుడే
తెలిసివస్తుంది.

చావులోనే మనిషి గొప్పతనం
తెలుస్తుందంటారు పెద్దలు.
మరణం మనిషి జీవనానికి మకుటం!

"మరణిస్తే నాకు విచారం లేదు.
ఎందుకంటే...నేనుదేవుని చేరుతాను!
జీవించినా నాకు భయం లేదు.
ఎందుకంటే...నన్ను దైవం ఆదుకుంటాడు!!"
ఈ భావనతో మనిషి తన బ్రతుకు గడపాలి.

పరిణామ శీలమైన దేహం
రూపాంతరం చెందటం
జీవ నైజం...అదేమరణం!
పరోపకార పరాయణులై జీవించిన మహాత్ములకి
మరణం
ఉండదు. వారు చిరంజీవులు!
అటువంటివారికి చావంటే భయం ఉండదు.
కారణం...
మరణం వచ్చినపుడు అతడు
లేడు. అతడు ఉన్నప్పుడు
మరణం ఆయనను చేరదు!

"నిత్యం సన్నిహితో మృత్యుః"
మరణం మనిషికి నీడ!
కనుక మనిషి కర్తవ్యం-ధర్మ
నిర్వహణం!ఇటువంటి లక్షణాలతో జీవన
సాఫల్యం పొందిన వ్యక్తి ఆచార్య ఎస్.టేకి.

ఆచార్యులు,ప్రధానాచార్యులు,
పీఠాధిపతి,కులసచివులు,ప్రత్యేక అధికారి, విశిష్ట
పరిశోధకులు....ఎన్ని పాత్రలు.

పుట్టుక అతనిది...మృతి అతనిది
బ్రతుకంతా...విశ్వ విద్యాలయానిది!!

**డా.తలారి వాసు**
**ఎడిటర్, నన్నయవాణి**


**ఆయన సేవల జ్ఞాపకాలు ఇక్కడ ఎప్పుడూ పదిలంగానే ఉంటాయి.**

## ఆచార్య టేకి జ్ఞాపకార్థ కూడికకు హాజరైన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆచార్యుడు ఎస్.టేకి మొదటి జ్ఞాపకార్థ కూడికకు వీసీ ఆచార్య కె. పద్మరాజు హాజరయ్యారు. రాజమండ్రి లోని వారి స్వగృహంలో జరిగిన కార్యక్రమానికి వీసీ హాజరై కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు. విశ్వవిద్యాలయానికి ఆచార్య టేకి చేసిన సేవలను ప్రస్తావన చేశారు. అలాగే విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, అధికారులు, అధ్యాపకులు హాజరై విశ్వవిద్యాలయానికి టేకి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించారు.



# ఈ జీవితం నీది!



నువ్వు ఎదగాలని కనే కల నీది,
ఆ కల నెరవేర్చుకోవడానికి ఎంచుకున్న గమ్యం నీది,
అది చేరడానికి వేసే మొదటి అడుగు నీది,
ఆ అడుగులు పరుగులుగా మారడానికి చేసిన కష్టం నీది,
ఎంతటి కష్టాన్నైనా తట్టుకొని చేసిన కఠోరశ్రమ నీది,
నిరంతరం శ్రమిస్తూ కార్చిన చెమట చుక్కా నీది,
చేసిన ప్రయత్నంలో ఎదురైన ఓటమీ నీది,
ఓటమిని తొలిమెట్టుగా చేసి గెలిచిన గెలుపు నీది.
కింద పడితే లేవల్సింది నీవే,
నీకు ధైర్యం నూరుపోసుకునేది నీవే,
చావు పుట్టుకలు నీవి కాకపోవచ్చు.. కానీ వాటి మధ్య
జీవితం నీదే.
నువ్వు ఏమి చేసినా చోద్యం చూసేవారు కొందరు,ఎగతాళి
చేసేవారు కొందరు,
నీ కాళ్లుపట్టుకు లాగేవారు మరి కొందరు,నీకు
తెలియకుండా నీ వెనక గోతులు తీసేవారు ఇంకొందరు,
నువ్వు బాగా ఎదిగావని ఈర్ష్యపడేవారు మరికొందరు,
ఎవరిని పట్టించుకోకు,
ఎవరి వైపు చూడకు,
నీ గమ్యం వైపు సాగిపో..
ఎందుకంటే నువ్వు ఎంతో పోరాడి గెలుచుకున్న జీవితం
ఇది.

బి.సుశాంత్ కుమార్
ANUR పూర్వ విద్యార్థి



# గణితశాస్త్రంలో మూర్తికి పిహెచ్.డి అవార్డు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో డా. సి. హెచ్. శ్రీనివాసులు పర్యవేక్షణలో పరిశోధన చేసిన రీసెర్చ్ స్కాలర్ డి.వి.ఎస్.ఎస్. ఆర్. మూర్తి కి వైస్ ఛాన్సలర్ కె.పద్మరాజు పిహెచ్.డీ ప్రదానం చేశారు. " కెల్లర్ బాక్స్ పద్ధతి ఉపయోగించి రసాయనక ప్రతిచర్యలతో వివిధ రకములైన ఐదు నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ పై సంఖ్యాత్మక విశ్లేషణ" అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర విభాగాధిపతి డా. టి.హైమావతి మాట్లాడుతూ ఈ పరిశోధన వలన వివిధ పారిశ్రామిక, ఇంజనీరింగ్ రంగాలలో ఉపయోగించే నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ ప్రసరణ వలన హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఏ విధంగా జరుగుతుందో తెలుస్తుందన్నారు. రీసెర్చ్ సూపర్ వైజర్ డా.సి.హెచ్.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పరిశోధనలో ఉపయోగించే నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ ప్రస్తుతం వైద్య విభాగంలో క్యాన్సర్ కణాలను నిర్ధారించడానికి మరియు మూత్రపిండాలలో రోగ నిర్ధారణకు మొదలగు విభాగాల్లో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుధాకర్, ఆర్ అండ్ డి విభాగాధిపతి రమణేశ్వరి, ప్రిన్సిపాల్ విజయనిర్మల, పి వెంకటేశ్వరరావు, జి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# డెల్టా రైతుల నుదుటి రాతలు మార్చిన మాన్యుడు

## సర్ ఆర్థర్ కాటన్ జీవితం - కృషి

ఈ పుస్తకం సివిల్ ఇంజనీరు, గోదావరి డెల్టా రూపశిల్పి అయిన ఆర్థర్ కాటన్ జీవితచరిత్ర. కాటన్ కుమార్తె లేడీ హోప్ ఈ గ్రంథానికి ఆంగ్లమూలాన్ని రచించింది. తెలుగు రచయిత, సాహిత్య విమర్శకుడు కవనశర్మ తెలుగులోకి అనువాదం చేశారు. నిర్మానుష్యంగా రాజమండ్రి వద్ద బొమ్మూరు మెట్టమీద ఒక గుర్రపుశాల, ఒక పెద్ద ఇల్లు అక్కడ నుండి చూస్తే గోదావరి నదిపై నిర్మించిన ఆనకట్టతో పాటు ఉరకలేస్తున్న గోదారమ్మ సోయగాలను వీక్షించవచ్చు. నీటి మీద రాతలు రాయలేం గానీ నీటిని ఆపి ఆనకట్ట కట్టి డెల్టా ప్రజల నుదుటిరాతను మార్చిన 'దేవుడు' సర్ ఆర్థర్ కాటన్ నివసించిన పవిత్ర స్థలం.

క్రీ.శ. 1803 సంవత్సరం మే 15న ఇంగ్లాండు అడ్డీస్ కాంబేలో హెన్రీ కాలేలీ కాటన్ దంపతులకు 10వ సంతానంగా జన్మించిన అర్థర్ కాటన్ 15 ఏళ్ళ ప్రాయంలోనే కేడెట్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని సౌత్ ఇండియాలోని మద్రాస్ చీఫ్ ఇంజినీరింగ్ ఆఫీసులో ఉద్యోగం పొందారు.

కరువుతో అల్లాడుతున్న మధుర, కోయంబత్తూరు, తిరునల్వేలి ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేసి ఆ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు చేసారు. 1840లో కృష్ణానదిపై ఆనకట్టకు ప్రతిపాదనలు రూపొందించి బ్రిటిష్ ప్రభుత్వానికి సిఫార్సు చేసారు.

17, 18 శతాబ్దాల కాలంలో అతివృష్టి, అనావృష్టి వరదలు వంటి వాటి కారణంగా బంగాళాఖాత తీరప్రాంతమైన కోరంగి, విశాఖపట్నం, యానాం, తదితర ప్రాంతాలలో కొన్ని వేలమంది చనిపోవడం, కొన్ని నౌకలు కూడా జలసమాధి కావడం జరిగింది.

1844లో మచిలీపట్నంలో వచ్చిన తుఫానుకు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ధాన్యరాశులు సముద్రంలో కలిసిపోయి 15 వేల మంది ప్రజలు మరణించడంతోపాటు గోదావరి, కృష్ణా ప్రాంతాలలో ప్రజలు ఆకలిమంటలతో అల్లాడిపోయారు.

అప్పటికే కాటన్ 1844, 1845, 1846 సంవత్సరాలలో నివేదికలు పంపించినా బ్రిటిష్ పాలనా యంత్రాంగం ఆమోదించలేదు.

దీంతో స్వయంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి 1847లో ఆనకట్ట నిర్మాణం మొదలు పెట్టారు కాటన్. ఎన్నో కష్టనష్టాలకోర్చి రవాణా సౌకర్యం లేని ఆ రోజులలో తన గుర్రంపై తిరిగి ఆయకట్టు ఎత్తుపల్లాలను సరిచూచుకొని కాలువలు తవ్వి చివరి ప్రాంత ఆయకట్టుకు కూడా నీరందించేలా డెల్టా వ్యవస్థను, ఆలాగే డ్రైనేజీ సదుపాయం, లాకుల వ్యవస్థ నిర్మించి కాలువలలో ప్రవహించే నీరు వృధాకాకుండా రైతులకు ఎక్కువ నీరు ఉపయోగపడేలా డెల్టాను రూపొందించిన ఘనులు.

1852లో గోదావరి గోదావరి ఆనకట్ట నిర్మాణాన్ని పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజల హృదయాలలో అపర భగీరథుడిగా మిగిలి, ఘనకీర్తిని సంపాదించుకున్నారు.

దేశచరిత్రలో తొలిసారిగా కృష్ణా, గోదావరి డెల్టాల వ్యవస్థను కాలువ ఆయకట్లు, డ్రైనేజ్ పద్ధతిలో నిర్మించి మార్గదర్శకులైనారు.

గోదావరి ప్రాంతానికి చెందిన వీణం వీరన్న 1847లో కాటన్ దగ్గర సహాయ ఇంజినీర్‌గా పనిచేసి కాటన్‌కు తోడుగా ఉండి ఆయన కార్యక్రమాలను అమలు చేసిన తొలి తెలుగు ఇంజినీర్‌గా చరిత్రలో నిలిచిపోయినారు.


1840లోనే కృష్ణానది కృష్ణానదిపై ఆనకట్ట ప్రతిపాదనలు బ్రిటీష్ ప్రభుత్వానికి పంపించి సిఫార్సు చేయడమే కాకుండా ధవళేశ్వరం బ్యారేజ్ పూర్తయిన తర్వాత కృష్ణా ఆనకట్టను నిర్మించారు కాటన్.

అందుకే గోదావరి, కృష్ణా ప్రాంత ప్రజలు దేవాలయాలకు వెళ్లినపుడు మొదటిగా అన్నం పెట్టినవాడే దేవుడిగా భావించి కాటన్ మహాశయుణ్ణి తలచుకోవడం జరుగుతుంది. ఆంధ్రప్రాంతాన్ని అన్నపూర్ణగా, రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చడంలో కాటన్ కృషి మరువలేనిది.

1858, 1863, 1867 సంవత్సరాల్లో కాటన్ బ్రిటిష్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు గంగానదిపై, ఒరిస్సాలోని ముఖ్యనదులపై ఆనకట్టలు నిర్మించే అమోఘమైన సలహాలు ఇచ్చారు.

ఈ కాలంలోనే కాలంలోనే హిమాలయాల నుండి కన్యాకుమారి వరకూ భారతదేశంలోని అన్ని నదులను అనుసంధానం చేసి యావత్ భారతదేశాన్ని సస్యశ్యామలం చేసే వినూత్న నివేదికలను మ్యాప్‌లను తయారుచేసి ఆ విధంగా జలరవాణాను కూడా ప్రోత్సహించాలని ఆనాడే ఆకాంక్షించారు.

రవాణా సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని ఆ రోజుల్లోనే కాటన్ వందలాది మైళ్ళు గుర్రంపై తిరిగి ఈ మహాయజ్ఞాన్ని పూర్తిచేసారు. కారు చౌకగా లభించే జలరవాణా ప్రాధాన్యతను గుర్తించి దానికి అనుగుణంగా వ్యవస్థను రూపొందించిన మహానుభావుడు.




ఈ ప్రాంత ప్రజలు తినే తిండిలో, తాగే నీటిలో, ఈ ప్రాంత అభివృద్ధిలో వెల్లివిరిసిన నాగరికతలో ఆయనే కనబడతాడు.
ఈ పుస్తకం ఆయన జీవితాన్నీ, కృషినీ సాకల్యంగా వివరిస్తుంది.

సాక్షి నుండి....

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in